సంపుటి :03 | సంచిక :41 | పేజీలు :06 | www.aksharadarbar.com

అక్షర దర్బార్
Voice of the People

శుక్రవారం 20, మార్చి 2026

వెల ₹5



## విద్యావ్యవస్థలో భారీ మార్పులు

- పదో తరగతి బోర్డు పరీక్షల రద్దు
- సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన



## ఈ-ఆఫీస్ వ్యవస్థకు శ్రీకారం

- పేపర్‌లెస్ పరిపాలనకు తొలి అడుగు
- సేవలు వేగవంతం, పారదర్శకత పెంపు లక్ష్యం
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

05




## `ఇందిరమ్మ బీమా ` భరోసా

- సామాన్య కుటుంబాలకు ఆర్థిక భద్రత
- కుటుంబ పెద్ద కాలం చేస్తే రూ.5 లక్షల సాయం
- కోటికిపైగా కుటుంబాలకు పథకం వర్తింపు
- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- గోదావరి పుష్కరాలకు రూ.500 కోట్లు
- ప్రభుత్వ ఉద్యోగులకు ఆరోగ్య రక్షణ
- నగదు రహిత వైద్యానికి సర్కార్ సై..
- తెలంగాణ బడ్జెట్‌లో సంక్షేమానికి ప్రాధాన్యం

05

# అండర్ 'గ్రౌండ్'కు హామీలు

## రాష్ట్ర బడ్జెట్‌లో యూజీడీ పనుల ప్రస్తావనే లేదు!



- రూ.5,257 కోట్ల ప్రాజెక్టుపై బడ్జెట్‌లో తిలోదకాలు
- జీవో ఇచ్చి, పాలనా పరమైన అనుమతులు ఇచ్చినా నిధుల ఊసేలేదు
- 30 ఏళ్ల నిరీక్షణకు దక్కని ఫలితం.. అటకెక్కిన ప్రభుత్వ హామీ
- దేవాదుల ప్రాజెక్ట్‌పైనా స్పష్టత కరువు
- పనుల పూర్తికి.. అన్ని ప్రాజెక్ట్‌లతో కలిపి ఈ ప్రాజెక్ట్ ప్రస్తావన
- కాళేశ్వర ఆలయ జీర్ణోద్ధరణ ప్రస్తావన ఉన్నప్పటికీ.. నిధులపై క్లారిటీ నో..
- మొత్తంగా ఉమ్మడి జిల్లాకు బడ్జెట్‌లో మళ్లీ మొండిచేయే

రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీవ్ర నిరాశే ఎదురైంది. మూడు దశాబ్దాల కల అయిన రూ.5,257 కోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) ప్రాజెక్టుకు ఇటీవలే పరిపాలనా అనుమతులు మంజూరైనా, బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై స్పష్టత లేకపోవడంతో ఆ ప్రాజెక్టు భవిష్యత్తు అంధకారంలో పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా హామీ ఇచ్చిన యూజీడీతో పాటు ప్రతిష్టాత్మక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మామునూరు ఎయిర్‌పోర్ట్ వంటి కీలక అంశాల ప్రస్తావనే బడ్జెట్‌లో లేకపోవడం గమనార్హం. దేవాదుల ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేస్తామని గతంలో సీఎం ప్రకటించినా, తాజా కేటాయింపుల్లో ఆ ముచ్చటే కనిపించలేదు. చివరకు గోదావరి పుష్కరాల నిధుల్లోనూ కాళేశ్వరం వంటి ఆలయాలకు ఒనగూరే ప్రయోజనంపై అస్పష్టత నెలకొంది. మొత్తంగా చూస్తే మంత్రుల సమీక్షలు, పాలకుల హామీలు కేవలం కాగితాలకే పరిమితమై, ఓరుగల్లు అభివృద్ధికి ఈ బడ్జెట్ మొండిచేయి చూపినట్లయింది.

– అక్షరదర్బార్, వరంగల్



## ఉమ్మడి వరంగల్ ను విస్మరించిన బడ్జెట్

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

## బడ్జెట్ అబద్ధాల పుట్ట



మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

## గొడవలో తల దూర్చాడని చెవి కొరికేశాడు

- అవుతాపురంలో ఘటన

05

## ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

05



# అండర్ గ్రౌండ్‌కు హామీలు



### బడ్జెట్ అబద్ధాల పుట్ట
### మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

అక్షరదర్బార్, వరంగల్
ఈరోజు అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వాస్తవ పరిస్థితులకు ఏమాత్రం పొంతన లేకుండా ఉంది. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క గారు ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌ను చిత్తశుద్ధి లేని పచ్చి అబద్ధాల కూర్పుగా నేను భావిస్తున్నాను. ప్రజలను మభ్యపెట్టడమే తప్ప ఈ బడ్జెట్‌లో ఆచరణ సాధ్యమైన అంశాలు ఏవీ కనిపించడం లేదు. ముఖ్యంగా రాజీవ్ యువవికాసం పేరుతో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను కాంగ్రెస్ పార్టీ మరోసారి దారుణంగా మోసం చేస్తోంది. యువత ఆశలపై నీళ్లు చల్లడమే ఈ ప్రభుత్వ పనిగా పెట్టుకుంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని బడ్జెట్‌లో పదే పదే ప్రస్తావిస్తున్నారు తప్ప, క్షేత్రస్థాయిలో దాన్ని అమలు చేయడం లేదు. కేవలం మాటలకే పరిమితమైన ఈ పథకం వల్ల పేదలకు వచ్చే లాభం ఏమీ లేదు. ఇక వెన్నెముక లాంటి వ్యవసాయ రంగాన్ని ఈ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. వ్యవసాయ కూలీలకు బడ్జెట్ నుంచి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం వారి పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న వివక్షను చాటుతోంది.

- - రాష్ట్ర బడ్జెట్‌లో యూజీడీ పనుల ప్రస్తావనే లేదు !
- - రూ.5,257 కోట్ల ప్రాజెక్టుపై బడ్జెట్‌లో తిలోదకాలు
- - జీవో ఇచ్చి, పాలనా పరమైన అనుమతులు ఇచ్చినా నిధుల ఊసేలేదు
- - 30 ఏళ్ల నిరీక్షణకు దక్కని ఫలితం.. అటకెక్కిన ప్రభుత్వ హామీ
- - దేవాదుల ప్రాజెక్ట్‌పైనా స్పష్టత కరువు
- - పనుల పూర్తికి.. అన్ని ప్రాజెక్ట్‌లతో కలిపి ఈ ప్రాజెక్ట్ ప్రస్తావన
- - కాళేశ్వర ఆలయ జీర్ణోద్ధరణ ప్రస్తావన ఉన్నప్పటికీ.. నిధులపై క్లారిటీ నో..
- - మొత్తంగా ఉమ్మడి జిల్లాకు బడ్జెట్‌లో మళ్లీ మొండిచేయే

అక్షరదర్బార్, వరంగల్
రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీవ్ర నిరాశే ఎదురైంది. మూడు దశాబ్దాల కల అయిన రూ.5,257 కోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) ప్రాజెక్టుకు ఇటీవలే పరిపాలనా అనుమతులు మంజూరైనా, బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై స్పష్టత లేకపోవడంతో ఆ ప్రాజెక్టు భవిష్యత్తు అంధకారంలో పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా హామీ ఇచ్చిన యూజీడీతో పాటు ప్రతిష్టాత్మక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మామునూరు ఎయిర్‌పోర్ట్ వంటి కీలక అంశాల ప్రస్తావనే బడ్జెట్‌లో లేకపోవడం గమనార్హం. దేవాదుల ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేస్తామని గతంలో సీఎం ప్రకటించినా, తాజా కేటాయింపుల్లో ఆ ముచ్చటే కనిపించలేదు. చివరకు గోదావరి పుష్కరాల నిధుల్లోనూ కాళేశ్వరం వంటి ఆలయాలకు ఒనగూరే ప్రయోజనంపై అస్పష్టత నెలకొంది. మొత్తంగా చూస్తే మంత్రుల సమీక్షలు, పాలకుల హామీలు కేవలం కాగితాలకే పరిమితమై, ఓరుగల్లు అభివృద్ధికి ఈ బడ్జెట్ మొండిచేయి చూపినట్లయింది.

రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత రెండో అతిపెద్ద నగరం, చారిత్రక ఓరుగల్లు అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి తన వైఖరిని బయటపెట్టుకుంది. మూడు దశాబ్దాలుగా నగరాన్ని వేధిస్తున్న మురుగునీటి సమస్యకు పరిష్కారంగా భావించిన 'అండర్ గ్రౌండ్ డ్రైనేజీ' (యూజీడీ) ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం జరిగింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలో రూ.5,257.20 కోట్లతో ఈ భారీ ప్రాజెక్టును చేపడతామని, ఇందుకు పరిపాలనా అనుమతులు ఇస్తూ ప్రభుత్వం జీవో కూడా విడుదల చేసింది. తొలివిడతగా రూ.వెయ్యి కోట్లు విడుదల చేయాల్సి ఉండగా, బడ్జెట్‌లో నిధుల ఊసేలేదు.. అయితే, తాజాగా ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో మెగా ప్రాజెక్టుకు సంబంధించిన నిధుల కేటాయింపుపై కనీస ప్రస్తావన లేదు. ఈ పరిణామం వరంగల్ ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా హామీ ఇచ్చిన ఈ ప్రాజెక్టు, కేవలం కాగితాలకే పరిమితమవుతుందా అన్న అనుమానాలు ఇప్పుడు బలపడుతున్నాయి.

### సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి.. అధోగతి

వైద్య రంగంలో వరంగల్ తలరాతను మారుస్తుందని ప్రచారం చేసిన మల్టీపర్పస్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు కూడా ఇప్పుడు గందరగోళంలో పడ్డాయి. గత ప్రభుత్వం 24 అంతస్తులతో ఆసియాలోనే అతిపెద్ద ప్రభుత్వ ఆసుపత్రిగా దీనిని ప్రారంభించింది. ఈ ప్రభుత్వం వచ్చాక పనులు వేగవంతం చేస్తామని, జూన్ నాటికల్లా రోగులకు అందుబాటులోకి తెస్తామని మంత్రులు పలుమార్లు హామీ ఇచ్చారు. కానీ, బడ్జెట్‌లో ఈ ఆసుపత్రి పూర్తికి అవసరమైన ప్రత్యేక నిధుల గురించి ఎక్కడా సమాచారం లేదు. నిధుల కొరత సాకుతో పనులు నత్తనడకన సాగితే, డిసెంబర్ నాటికి కూడా ఈ ఆసుపత్రి పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. పేదలకు మెరుగైన వైద్యం అందిస్తామన్న నినాదం బడ్జెట్ అంకెల్లో ఎక్కడా ప్రతిబింబించలేదు.

### దేవాదుల నుంచి ఎయిర్‌పోర్ట్ దాకా..

### అంతా అదే తీరు

సాగునీటి రంగంలో కీలకమైన దేవాదుల ప్రాజెక్టు విషయంలోనూ వరంగల్ వాసులకు నిరాశే ఎదురైంది. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా దేవాదుల పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. కానీ బడ్జెట్‌లో దేవాదుల పేరు ఒక్కసారి కూడా వినిపించలేదు. అదేవిధంగా మామునూరు ఎయిర్‌పోర్ట్ అంశం కూడా పాత హామీలకే పరిమితమైంది. గోదావరి పుష్కరాల ఏర్పాట్ల కోసం కేటాయించిన రూ. 500 కోట్లలో కాళేశ్వరం ఆలయానికి, ఘాట్లకు ఎంత దక్కుతుందో కూడా అస్పష్టంగానే ఉంది. మొత్తంగా చూస్తే, ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఈ బడ్జెట్ ఒక పెద్ద మొండిచేయిగా మిగిలిపోయింది. మంత్రుల సమీక్షలు, ముఖ్యమంత్రి హామీలు అన్నీ ఎన్నికల రాజకీయాలకే పరిమితమయ్యాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నిధుల కేటాయింపులో స్పష్టత లేకపోవడం వల్ల యూడీఎస్ వంటి ప్రాజెక్టులు ఇప్పట్లో పట్టాలెక్కే సూచనలు కనిపించడం లేదు. ఇది ఓరుగల్లు అభివృద్ధిని మరో దశాబ్దం వెనక్కి నెట్టే ప్రమాదం ఉందని జిల్లా ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

### ఉమ్మడి వరంగల్ ను విస్మరించిన బడ్జెట్
### సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ చూస్తుంటే ఉమ్మడి వరంగల్ జిల్లాను పూర్తిగా విస్మరించినట్లు స్పష్టమవుతోంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌పై చూపిన శ్రద్ధలో పదో వంతు కూడా వరంగల్ మీద చూపకపోవడం దారుణం. రాష్ట్రానికి రెండో రాజధానిగా, హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం.. తీరా బడ్జెట్ కేటాయింపుల దగ్గరకు వచ్చేసరికి జిల్లాను గాలికొదిలేసింది. వరంగల్ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు ఇస్తారని ఆశించాం, కానీ కొత్త ప్రాజెక్టులు లేవు.. పరిశ్రమల ఊసే లేదు. ముఖ్యంగా ఈ ప్రాంత రైతాంగానికి వరప్రదాయిని అయిన దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన ప్రత్యేక నిధుల కేటాయింపులు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం.

---

# ఇందిరమ్మ బీమా భరోసా

- - సామాన్య కుటుంబాలకు ఆర్థిక భద్రత
- - కుటుంబ పెద్ద కాలం చేస్తే రూ.5 లక్షల సాయం
- - కోటికిపైగా కుటుంబాలకు పథకం వర్తింపు
- - ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- - గోదావరి పుష్కరాలకు రూ.500 కోట్లు
- - ప్రభుత్వ ఉద్యోగులకు ఆరోగ్య రక్షణ
- - నగదు రహిత వైద్యానికి సర్కార్ సై..
- - తెలంగాణ బడ్జెట్‌లో సంక్షేమానికి ప్రాధాన్యం

అక్షరదర్బార్, హైదరాబాద్
తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌లో సామాన్య ప్రజల ఆర్థిక భద్రతకు పెద్దపీట వేసింది. ముఖ్యంగా పేద కుటుంబాలకు అండగా నిలిచేలా 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని ప్రకటించడం గమనార్హం. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల మేర బీమా కవరేజీ లభిస్తుంది. అనుకోని విపత్తు సంభవించినప్పుడు ఆ కుటుంబం రోడ్డున పడకుండా ఈ నగదు ఆదుకుంటుంది. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి ఈ భరోసా కల్పించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలోని కోటికి పైగా కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

### విద్యార్థులకు పోషకాహారం

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం విస్తరించింది. ఇప్పటివరకు పాఠశాల స్థాయికే పరిమితమైన ఈ సౌకర్యాన్ని ఇప్పుడు కళాశాల విద్యార్థులకు కూడా వర్తింపజేయనున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థులు ఆకలితో అలమటించకుండా చదువుపై దృష్టి పెట్టాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. బడ్జెట్‌లో దీని కోసం ప్రత్యేక నిధులు కేటాయించడం ద్వారా ప్రభుత్వ కాలేజీల్లో చదివే వేలాది మందికి ప్రయోజనం చేకూరనుంది.

### విద్యా సంస్థల ఆధునీకరణ

రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలను ఈ పాఠశాలల్లో కల్పిస్తారు. దీంతోపాటు యువతకు ఉపాధి నైపుణ్యాలను పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని కూడా స్థాపించనున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడం ద్వారా నిరుద్యోగ సమస్యను అరికట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ప్రతి నియోజకవర్గ కేంద్రం ఒక విద్యా హబ్‌గా మారేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

### - గోదావరి పుష్కరాల నిర్వహణ

వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.500 కోట్లను ప్రత్యేకంగా కేటాయించింది. భక్తుల సౌకర్యార్థం ఘాట్ల నిర్మాణం, రవాణా సౌకర్యాలు, పారిశుధ్యం వంటి పనులను ఈ నిధులతో చేపడతారు. పుష్కరాల సమయంలో వచ్చే కోట్ల మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ భారీ కేటాయింపులు చేయడం జరిగింది.

### ఉద్యోగులకు ఆరోగ్య రక్షణ

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం బడ్జెట్‌లో నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని ప్రకటించారు. ఈ పథకం కింద ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేస్తారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు 421 ఎంపానల్డ్ ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స పొందే అవకాశం కలుగుతుంది. రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా ఈ పథకాన్ని పర్యవేక్షిస్తారు. సుమారు 23.51 లక్షల మందికి దీనివల్ల లబ్ధి చేకూరనుంది. దాదాపు 1,998 రకాల వ్యాధులకు ఎటువంటి నగదు చెల్లించకుండానే కార్పొరేట్ వైద్యం పొందే వీలుంటుంది.

### ఇందిరమ్మ ఇళ్లకు నిధులు

సొంత ఇల్లు లేని పేదల కల సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. అర్హులైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సాయాన్ని విడతల వారీగా అందజేస్తారు. క్షేత్రస్థాయిలో పారదర్శకమైన విచారణ చేపట్టిన తర్వాతే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది. ఇల్లు లేని నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించాలనే సంకల్పంతో ఈ నిధులను మంజూరు చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివాసయోగ్యమైన గృహాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది.

# పరకాల మున్సిపల్ బడ్జెట్ సమావేశం

- ఏకగ్రీవంగా ఆమోదించిన పాలకవర్గం
- ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ రవి
- మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాం
- మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్





అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ అధ్యక్షతన ప్రత్యేక బడ్జెట్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘం పరకాల 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక అంచనా బడ్జెట్‌ను కమిషనర్ అంజయ్య ప్రవేశపెట్టగా, పాలకవర్గ సభ్యులు చర్చించి ఆమోదించారు. సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ఆదాయ వనరులను పరిగణలోకి తీసుకొని బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలిపారు. పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు వివిధ అభివృద్ధి పనులకు తగిన కేటాయింపులు చేసినట్లు వివరించారు. జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వాస్తవ ఆదాయం–ఖర్చులను ఆధారంగా చేసుకొని బడ్జెట్ రూపొందించబడినదని తెలిపారు. ఈ బడ్జెట్ పట్టణ అభివృద్ధికి మరింత దోహదపడుతుందని, కౌన్సిలర్లు సూచించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు.ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ ఏకు దివ్య విద్యాసాగర్, పాలకవర్గ సభ్యులు, కార్యాలయ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## మాయల ఫకీరు బడ్జెట్

**బిఆర్ఎస్ నాయకులు రఘుపతి, శివ**



అక్షరదర్బార్,పరకాల: రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్‌ను “మాయల ఫకీరు బడ్జెట్”గా బీఆర్ఎస్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పోచంపల్లి రఘుపతి, నాయకులు గుడి కందుల శివ తీవ్రంగా విమర్శించారు. వారు మాట్లాడుతూ భారీగా ₹3.24 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 8.22% నిధులు కేటాయించడం ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. నిరుద్యోగ భృతి, జాబ్ కాలెండర్, ఉద్యోగ నోటిఫికేషన్లపై ఎలాంటి స్పష్టత లేదని, ఆరు గ్యారెంటీల అమలు కూడా కనిపించడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అప్పులపైనే ఆధారపడి కాలయాపన చేస్తోందని, యువత, విద్యార్థులను మోసం చేస్తోందని వారు పేర్కొన్నారు.

## గౌడ సంఘం ఆధ్వర్యంలో ఉగాది



అక్షరదర్బార్, పరకాల: శాయంపేట మండలం పెద్దకొడపాక గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం శ్రీ ఎల్లమ్మ ఆలయంలో జరిగిన ఈ వేడుకల్లో గౌడ సంఘ అధ్యక్షుడు తడక శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించి, కులస్తులందరూ సంప్రదాయంగా ఉగాది పచ్చడి తయారు చేసి స్వీకరించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అధ్యక్షుడు తడక శ్రీనివాస్ మాట్లాడుతూ గీతవృత్తిని ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్న గౌడ కులస్తులను ఎల్లమ్మ తల్లి కాపాడుతుందనే నమ్మకం తమకు ఉందన్నారు. ప్రతి సంవత్సరం ఉగాది సందర్భంగా తొలి బోనం తమ ఆరాధ్య దైవమైన ఎల్లమ్మ తల్లికి సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు తడక సుదర్శన్ గౌడ్, పాలకవర్గ సభ్యులు గట్టు కొమురయ్య గౌడ్, తడక తిరుపతి గౌడ్, తడక ఆగయ్య గౌడ్, తడక శంకర్ గౌడ్, రాపర్తి మల్లయ్య గౌడ్, ఐలి తిరుపతి గౌడ్, మార్క రఘుపతి గౌడ్ పాల్గొన్నారు.



## పశువులకు టీకాలు

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం నూర్జహన్ పల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినదని మండల పశు వైద్యాధికారి సునీల్ తెలిపారు.గాలికుంటు వ్యాధి వలన పశువులలో తీవ్రమైన జ్వరం, నోటిలో, గిట్టాలలో పుండ్లు ఏర్పడి నొప్పి నిరసించిపోతాయని అన్నారు.పాల ఉత్పత్తి కూడా తగ్గి కొన్ని సందర్భాల్లో పశువులు మరణించే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు.కావున పశువులు ఉన్న ప్రతి రైతు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజీర్, సిబ్బంది రమేష్ బాబు, రవీందర్, సదానందం రైతులు పాల్గొన్నారు.

## పీహెచ్ సీలో కలెక్టర్ తనిఖీ

అక్షరదర్బార్, పర్వతగిరి : పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి, వైద్య సేవల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఆమె వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివ రావు ఉన్నారు. కలెక్టర్ ఆసుపత్రిలోని ఓపీ రిజిస్టర్, హాజరు నమోదు పుస్తకాలు, ఔషధ నిల్వలు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. బాల్య వివాహాలను నిరోధించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు మాట్లాడుతూ పనులను త్వరిత గతిన పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిదురు శంకర్, వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ రాజ్, డాక్టర్ మౌనిక, రెవెన్యూ, పంచాయతీరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా

**అభివృద్ధిలో ప్రజల సహకారం తప్పనిసరి: జనగాం రవి**

అక్షర దర్బార్, వెంకటాపూర్ : వెంకటాపూర్ మండలంలోని నల్లగుంట గ్రామంలో గల శ్రీకృష్ణ దేవాలయం మరియు రామాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ గా జనగాం రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీకృష్ణ దేవాలయంలో గ్రామ సర్పంచ్ భూక్య శ్రీదేవి, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అధ్యక్షునిగా ఎన్నికైన జనగాం రవి మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో దేవాలయాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు మరియు అధ్యక్షునికి గ్రామానికి చెందిన ఎన్నారై పెంచాల రాజేష్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులచే దేవాలయ ప్రాంగణంలో గ్రామానికి చెందిన కృష్ణమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులుగా రఘు, కోశాధికారిగా జయ, ప్రధాన కార్యదర్శిగా నరసింహారెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా సంతోష్, కార్యదర్శులుగా రమేష్, శ్రీనివాస్, దీపక్, మందల చిన్న వెంకటరమణారెడ్డిని గౌరవ సలహాదారునిగా, ఎన్నుకున్నారు.

## గీతాంజలిలో ప్రీ-రంజాన్ వేడుకలు

అక్షర దర్బార్ , నర్సంపేట : వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో ప్రీ–రంజాన్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే రంజాన్ పండుగను పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భిన్నత్వంలో ఏకత్వం భారతదేశం ప్రత్యేకతగా నిలుస్తుందని, దేశంలో వివిధ మతాలు, భాషల ప్రజలు కలిసికట్టుగా జీవిస్తూ అన్ని పండుగలను గౌరవంగా జరుపుకుంటారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ముస్లిం విద్యార్థులు, అధ్యాపకులకు ఇతర విద్యార్థులు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎన్ రాజేష్ మాట్లాడుతూ, భారతదేశం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలవడానికి కారణం ప్రజల ఐక్యతేనని అన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో పరమత సహనాన్ని పెంపొందించడం ఉపాధ్యాయుల బాధ్యత అని తెలిపారు.

## తెలంగాణ ఓ మార్క్ ఫెడ్

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



అక్షర దర్బార్, నర్సంపేట@తెలంగాణ ఓ మార్క్ ఫెడ్ అని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.అన్నారు.శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నర్సంపేట మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఎఓ అనురాధ, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, ఆర్డీఓ ఉమారాణి, తహసీల్దార్ రవిచంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సైని కలిసిన ఏబీవీపీ నాయకులు

అక్షర దర్బార్ చిట్యాల అఖిల భారత విద్యార్థి పరిషత్ మండల శాఖ ఆధ్వర్యంలో నాయకులు నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న పరిస్థితులను వివరిస్తూ మండల కేంద్రం లో కొంత మంది యువకులు బైక్స్ పై స్టంట్స్ చేస్తూ పరీక్షల కేంద్రాల వద్ద,చౌరస్తా ,గురుకుల బాలికల పాఠశాల వద్ద తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు అని మద్యం మత్తు లో అధిక వేగం తో వెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారని వివరిస్తూ వినతి పత్రానికి సమర్పించారు. కార్యక్రమంలో చిట్యాల నగర కార్యదర్శి



ముష్కే అజయ్, సరిగొమ్ముల శశివర్ధన్ ,అక్షయ , మాన్సి పాల్గొన్నారు. 1



# గత బడ్జెట్‌పై శ్వేతపత్రం విడుదల చేయాలి

## : ఏఐకేఎఫ్ డిమాండ్

అక్షర దర్బార్, నర్సంపేట : వరంగల్ జిల్లా నర్సంపేటలో అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై విమర్శలు చేశారు. గత బడ్జెట్ ఆదాయ–వ్యయాలపై అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్ ఆర్భాటంగా ఉన్నప్పటికీ ఆచరణలో లోపాలున్నాయని అన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధి చూపలేదని విమర్శించారు.రైతుల సంక్షేమానికి కనీసం 10 శాతం నిధులు కేటాయించకపోవడం అన్యాయమని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. రైతు రుణాలు, భరోసా, పంటల మద్దతు ధరల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని అన్నారు. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ నిధులు పెంచాలని, విద్య–వైద్య రంగాల్లో పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రజల అభివృద్ధికి అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన చేయాలని డిమాండ్ చేశారు.



# ఘోర రోడ్డు ప్రమాదం

## ఒకరు మృతి, ఆరుగురికి తీవ్ర గాయాలు

అక్షర దర్బార్, మరిపెడ : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల పరిధిలోని పురుషోత్తమాయగూడెం సమీపంలో జాతీయ రహదారి 365పై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మహబూబాబాద్ నుంచి మరిపెడ వైపు వస్తున్న కారు అతివేగంతో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురికి తీవ్ర గాయాలు కాగా, ఆసుపత్రికి తరలించే క్రమంలో రామస్వామి వెంకన్న మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.ప్రమాద సమయంలో ఆటోలో పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు శుభకార్యానికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ ను అదుపులోకి తీసుకుని, అతివేగంగా వాహనం నడిపినందుకు కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.

# స్టోన్ క్రషర్ ను పరిశీలించిన ఏఈ



అక్షర దర్బార్ శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామ శివారులో నడుస్తున్న స్టోన్ క్రషర్ ను పొల్యూషన్ ఏఈ సుభాష్ శుక్రవారం తనిఖీ చేశారు.క్రషర్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.దుమ్ము ధూళి లేవకుండా నీటిని ఎప్పటికప్పుడు స్ప్రే చేయకుండా క్రషర్ యజమాన్యం నిర్లక్ష్యం చేస్తున్నారనే విషయాన్ని గ్రహించారు.అనంతరం గ్రామంలో క్రషర్, డాంబర్ ప్లాంట్ వల్ల వచ్చే అనర్థాలను గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డాంబర్ ప్లాంటు నుండి వచ్చే దుర్వాసన వల్ల శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఏఈకి తెలిపారు.క్రషర్ నుంచి వచ్చే పెద్ద పెద్ద శబ్దాల వల్ల ఇండ్లు పగుళ్లు ఏర్పడుతున్నాయని ఏఈ దృష్టికి తీసుకొచ్చారు.డాంబర్ ప్లాంట్ వాసన దుర్వాసన వస్తున్నదని వృద్ధులు చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.ఏఈ స్పందిస్తూ క్రషర్ డాంబర్ ప్లాంట్ వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను పై అధికారులకు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు.

## ప్రజావాణిలో ఫిర్యాదు

సోమవారం ప్రజావాణిలో పత్తిపాక గ్రామ శివారులో ఉన్న స్టోన్ క్రషర్ పర్మిషన్ రద్దు చేయాలి ఉపసర్పంచ్ వార్డ్ సభ్యులు కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. క్రషర్ బ్లాస్టింగ్ వల్ల పంట పొలాలు, ఇండ్లు దెబ్బతింటున్నాయని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. దుమ్మూ, ధూళి వల్ల ప్రజలు శ్వాస కోస వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు.

# బీజేపీ 'చలో అసెంబ్లీ' ముట్టడి విజయవంతం చేయాలి



అక్షర దర్బార్ శాయంపేట : ఈ నెల 23న రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా "చలో అసెంబ్లీ ముట్టడి" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించనున్నామని శాయంపేట బిజెపి మండల అధ్యక్షుడు నరహరి శెట్టి రామకృష్ణ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి ప్రజలను మోసం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు.రైతులకు పూర్తి రుణమాఫీ, యువతకు ఉద్యోగాలు, మహిళలకు భద్రత వంటి ముఖ్య హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.ధరల పెరుగుదల, నిరుద్యోగం, అవినీతి వంటి సమస్యలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే పనిచేస్తోందని విమర్శించారు.ఈ నేపథ్యంలో ప్రజల హక్కుల కోసం, ప్రభుత్వం వెంటనే తన తప్పులను సరిదిద్దుకునేలా ఒత్తిడి తేవడానికి "చలో అసెంబ్లీ ముట్టడి" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.శాయంపేట మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రజా ప్రభుత్వంలోనే పేదోడి సొంతింటి కల సాకారం

## టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి



అక్షరదర్బార్,నెక్కొండ : కాంగ్రెస్ ప్రభుత్వంలోని పేదోడి సొంతింటి కల సహకారం అవుతుందని నర్సంపేట టీపీసీసీ సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి అన్నారు శుక్రవారం నెక్కొండ మండలంలోని పీకే తండా గ్రామపంచాయతీ పరిధిలో గల బొగ్గుల తండా వాస్తవ్యులు బోడ రవి –మౌనిక నిర్మించిన నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం కార్యక్రమానికి టీపీసీసీ సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ ప్రధాన కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు వర్కింగ్ ప్రెసిడెంట్స్ మాదటి శ్రీనివాస్ లావుడ్యా తిరుమల్ కోశాధికారి కేవీ సుబ్బారెడ్డి చల్లా శ్రీపాల్ రెడ్డి మాజీ సొసైటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు

# నిరుద్యోగ భృతిపై ఎలాంటి ప్రకటన లేకపోవడం బాధాకరం



అక్షర దర్బార్ శాయంపేట : తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపై తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తూ, తెలంగాణ ఉద్యమకారుడు సామాజిక సేవకుడు అమ్మ అశోక్ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు.రాష్ట్ర యువత ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న నిరుద్యోగ భృతిపై ఎలాంటి ప్రకటన లేకపోవడం బాధాకరమని తెలిపారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.అదే విధంగా, యువతకు అత్యంత కీలకమైన జాబ్ క్యాలెండర్ గురించి కూడా ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడం ప్రభుత్వం వైఫల్యానికి నిదర్శనమని అన్నారు.ఇంకా, ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపశమనం కలిగించే విధంగా ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ప్రభుత్వం చెప్పిన ఆరు గ్యారంటీలు కూడా అమలు దశలో కనిపించకపోవడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు.ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన రాజకీయాలు చేస్తూ, ప్రజల సమస్యలను పక్కన పెట్టిందని అన్నారు. ప్రజలు నమ్మి ఇచ్చిన అధికారాన్ని వాగ్దానాలకే పరిమితం చేయకుండా, ఆచరణలో చూపించాలి.లేని పక్షంలో యువత తిరుగుబాటు తప్పదు" అని అన్నారు.

# ఈటలను కలిసిన లడేశివ



అక్షరదర్బార్, పరకాల: మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను హనుమకొండకు చెందిన బీజేపీ నాయకులు, విద్యావేత్త లాడే శివ మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా లాడే శివ మాట్లాడుతూ, ప్రజాసేవలో ఈటల రాజేందర్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన పాత్ర అభినందనీయమని పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ నాయకులు పరామర్శ




అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ మల్లారెడ్డిపల్లి ప్రాంతంలో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. 17వ వార్డుకు చెందిన బుస రవి తండ్రి బుస ఐలన్న గురువారం మృతి చెందగా, అదే ప్రాంతానికి చెందిన గుర్రం కిషన్ తల్లి గుర్రం పుష్ప శుక్రవారం తెల్లవారుజామున హఠాత్తుగా మరణించారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్ శనిగరపు రజని నవీన్, 18వ వార్డు కౌన్సిలర్ రేగురి కరుణ విజయపాల్ రెడ్డి తదితర నాయకులు మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోటం భద్రయ్య, ఎం.డి. అల్తాఫ్, సుజయ్ రానా, మాజీ ఏఎంసీ డైరెక్టర్ నక్క చిరంజీవి, తోట రవీందర్, పల్లెబోయిన రంజిత్, రాయబారపు అనిల్, చెట్టి ఏసుదాసు, దామ శివ, ఒంటేరు రాజకుమార్, కనుకుంట్ల రాజేష్, మహిళా నాయకురాలు ఎం.డి. షాహిన్, బండారి కోమల, కనుకుంట్ల లక్ష్మి పాల్గొన్నారు.

# విద్యావ్యవస్థలో భారీ మార్పులు

- పదో తరగతి బోర్డు పరీక్షల రద్దు
- సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన



అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో భాగంగా భవిష్యత్తులో పదో తరగతి బోర్డు పరీక్షలు ఉండబోవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దేందుకు ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్ చాట్‌లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్లస్ టూ (+2) విద్యా విధానం అమలులో ఉందని, దానిని అధ్యయనం చేసిన తర్వాతే రాష్ట్రంలో మార్పులు చేస్తామని తెలిపారు. త్వరలోనే ఎస్సెస్సీ బోర్డు రద్దు కానుందని, దీనిపై నియమించిన ఎడ్యుకేషన్ కమిషన్ నివేదికను పరిశీలిస్తామని చెప్పారు. అయితే, కమిషన్ నివేదికే ఫైనల్ కాదని, విద్యావ్యవస్థలో సమూల ప్రక్షాళన కోసం మరిన్ని అధ్యయనాలు నిర్వహిస్తామని ఆయన వివరించారు.

# ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

అక్షరదర్బార్, వర్ధన్నపేట: పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వర్ధన్నపేట నియోజకవర్గ ముస్లింలకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంజాన్ మాసం ఆత్మపరిశుద్ధికి, నియమ నిష్ఠలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఉపవాస దీక్షలు మనసుకు నియంత్రణను, జీవనంలో క్రమశిక్షణను అందించడంతో పాటు, సమాజంపై సేవా దృక్పథాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈద్–ఉల్–ఫితర్ పండుగ ఉపవాస దీక్షల అనంతరం ఆనందాన్ని పంచుకునే పవిత్ర వేడుకగా భావించబడుతుందని తెలిపారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవాన్ని పెంపొందించడంలో రంజాన్ ప్రత్యేకమైన ప్రాధాన్యత కలిగి ఉందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో వివిధ మతాల ప్రజలు ఐక్యంగా, సామరస్యంతో జీవించడం రాష్ట్ర గొప్ప సంప్రదాయమని, ఈ సంస్కృతి మరింత బలపడాలని ఆకాంక్షించారు.



# గొడవలో తల దూర్చాడని చెవి కొరికేశాడు

- అవుతాపురంలో ఘటన



అక్షరదర్బార్, మహబూబాబాద్ : గొడవలో తల దూర్చాడని ఆగ్రహానికి లోనైన ఓ వ్యక్తి.. బాధిత వ్యక్తి చెవి కొరికిన ఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దగూడూరు మండలం అవుతాపురంలో జరిగింది. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేట గ్రామానికి చెందిన జోగు సతీష్ అనే వ్యక్తి అవుతాపురం గ్రామానికి చెందిన ముగ్గురితో గొడవ పడుతున్నాడు. అదే గ్రామానికి చెందిన బందు శశి కుమార్, గద్దల రోహిత్, చెడుపాక సాంబశివ అనే ముగ్గురు అక్కడికి వచ్చి గొడవను ఆపేందుకు ప్రయత్నించారు. దీనికి ఆగ్రహించిన సతీష్.. బందు శశి కుమార్ చెవిని నోటితో గట్టిగా కొరకడంతో చెవి భాగం కొంత ఊడి పడిపోయింది. గాయపడ్డ శశికుమార్‌ను ఆసుపత్రికి తరలించారు. బాధితుడి సోదరుడు వెంకన్న పోలీసులకు సమాచారం ఇవ్వగా పెద్ద వంగర ఎస్సు చిలువేరి ప్రమోద్ కుమార్ గౌడ్ ఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపి కేసు దర్యాప్తు చేపట్టారు.



# కేటీపీపీలో సాంకేతిక లోపం

- 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్

అక్షరదర్బార్, చెల్పూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ వద్ద ఉన్న కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (కేటీపీపీ)లో సాంకేతిక సమస్య తలెత్తింది. మొదటి దశలోని 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో బాయిలర్ ట్యూబ్ లీకేజీ కావడంతో శుక్రవారం విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా మొదటి యూనిట్‌లో ఉత్పత్తిని అధికారులు నిలిపివేయాల్సి వచ్చింది. ఉత్పత్తి నిలిచిపోవడం వల్ల రోజుకు సుమారు రూ.2 కోట్ల మేర నష్టం వాటిల్లుతున్నట్లు సమాచారం. లీకేజీని గుర్తించిన కేటీపీపీ ఇంజనీర్లు, సాంకేతిక సిబ్బంది వెంటనే మరమ్మత్తు పనులు ప్రారంభించారు. బాయిలర్ చల్లబడిన తర్వాత పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేసి, తిరిగి ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు అధికారులు శ్రమిస్తున్నారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న తరుణంలో, కీలకమైన 500 మెగావాట్ల ఉత్పత్తి నిలిచిపోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# కాంగ్రెస్ కీలక భేటీ

- కార్పొరేషన్ చైర్మన్ల భర్తీపై కసరత్తు

అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణలో నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ వేగవంతమైంది. నగరంలోని ఎమ్మెల్యే క్వార్టర్స్ వేదికగా కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు శుక్రవారం సమావేశమయ్యారు. కార్పొరేషన్ చైర్మన్ల ఎంపికే ప్రధాన అజెండాగా ఈ చర్చలు సాగుతున్నాయి. ఈ భేటీలో ఏఐసీసీ కార్యదర్శి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ముఖ్యమంత్రి రాజకీయ సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్ పదవుల కోసం ఎదురుచూస్తున్న పార్టీ కార్యకర్తలు, నేతల వివరాలను మీనాక్షి నటరాజన్, మహేష్ గౌడ్ సేకరిస్తున్నారు. సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుంటూ తుది జాబితాను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. కీలక నేతలను వ్యక్తిగతంగా పిలిపించి, ఆయా జిల్లాల్లో సమర్థులైన అభ్యర్థుల వివరాలపై ఆరా తీస్తున్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కార్పొరేషన్ చైర్మన్ పదవులను త్వరలోనే భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఈ-ఆఫీస్ వ్యవస్థకు శ్రీకారం

- పేపర్ లెస్ పరిపాలనకు తొలి అడుగు
- సేవలు వేగవంతం, పారదర్శకత పెంపు లక్ష్యం
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



అక్షరదర్బార్, జనగామ : ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న ఈ–ఆఫీస్ నిర్వహణ ద్వారా ఫైళ్ల పరిష్కారం పారదర్శకంగా, వేగవంతం అవుతుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిపాలనను ఆధునికీకరించి పనితీరులో జవాబుదారీతనాన్ని పెంచే విధంగా ఈ–ఆఫీస్ నిర్వహణకు శ్రీకారం చుట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని కార్యాలయాల్లో పేపర్ వినియోగాన్ని తగ్గిస్తూ, ఫైళ్లను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ–ఆఫీస్ అమలు ద్వారా ఫైళ్ల ప్రాసెసింగ్ వేగవంతమవుతుందని, నిర్ణయాలు త్వరితగతిన తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి శాఖలో ఈ విధానాన్ని సమర్థవంతంగా వినియోగించి, ప్రజలకు సేవలు మరింత మెరుగ్గా అందించాలని ఆదేశించారు. అలాగే అధికారులు, సిబ్బంది ఈ–ఆఫీస్ వ్యవస్థపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అవసరమైన శిక్షణను పొందాలని కలెక్టర్ సూచించారు. ఫైళ్ల నిల్వ, ట్రాకింగ్ సులభతరం అవుతుందని, పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హన్మకొండలో చైన్ స్నాచింగ్

- మహిళ మెడలోంచి మూడు తులాల పుస్తెల తాడు అపహరణ

అక్షరదర్బార్, హనుమకొండ: నగరంలోని కేఎల్ఎన్ రెడ్డి కాలనీలో పట్టపగలే దొంగలు బీభత్సం సృష్టించారు. నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళను లక్ష్యంగా చేసుకుని గొలుసు దొంగతనానికి పాల్పడ్డారు. స్థానిక కేఎల్ఎన్ రెడ్డి కాలనీకి చెందిన మోడం స్వప్న అనే గృహిణి, తన దైనందిన పనుల్లో భాగంగా మగ్గం వర్క్‌షాప్‌కు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆమె నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో, బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఒక్కసారిగా ఆమెపై పడ్డారు. క్షణాల వ్యవధిలోనే ఆమె మెడలో ఉన్న సుమారు మూడు తులాల బంగారు పుస్తెల తాడును బలవంతంగా లాక్కొని, వేగంగా అక్కడి నుండి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సుబేదారి ఇన్ స్పెక్టర్ రంజిత్ కుమార్ రంగంలోకి దిగారు. ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన పోలీసులు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను పట్టుకోవడానికి పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915